హామీల ఊసేదీ సోమన్నా..?

- స్థానిక సమస్యలపై ఎన్నికల వేళ ప్రకటనలు
- అధికారంలోకి వచ్చాక గప్‌చుప్
- వందరోజుల కూటమి పాలనపై ప్రజల పెదవి విరుపు


ప్రజలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సోమిరెడ్డి (ఫైల్)

పొదలకూరు : కూటమి ప్రభుత్వం వంద రోజుల పాలనపై ప్రజలు పెదవి విరుస్తున్నారు. ఎలాంటి సంక్షేమ పథకాలు ప్రజలకు అందలేదంటున్నారు. అయితే కూటమి ప్రభుత్వం వందరోజుల పాలనపై మంచి పాలన పేరుతో గడప గడపకు వెళ్లి సీఎం బొమ్మలను అతికించమని సచివాలయ ఉద్యోగులకు ఆదేశాలు జారీ చేసింది. ఈ నేపథ్యంలో సర్వేపల్లి నియోజకవర్గంలో ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి ఎన్నికల ప్రచారంలో ప్రజలకు పలురకాల హామీలను ఇచ్చారు. ఎన్నో ఏళ్లుగా పరిష్కారానికి నోచుకోని సమస్యలను గుర్తించామని, ఈ పర్యాయం తనకు అవకాశమిస్తే సమస్యలను పరిష్కరిస్తామన్నారు. అయితే వంద రోజుల పాలనలో హామీలను నెరవేర్చిన దాఖలాలు లేవు. ప్రభుత్వం నుంచి ఇప్పటి వరకు హామీలకు సంబంధించి ఎలాంటి నిధులు కూడా విడుదల కాలేదు. దీంతో పాటు సూపర్ సిక్స్ పథకాలపై గ్రామాల్లో పెద్ద ఎత్తున ప్రచారం చేశారు.

అమలుకు నోచుకోని హామీలు

వందరోజుల పాలనలో ఇప్పటి వరకు ఎన్నికల సందర్భంగా ఎమ్మెల్యే ఇచ్చిన హామీలు అమలుకు నోచుకోలేదు. చిన్నపాటి పనులు తప్పించి ఇప్పటి వరకు చెప్పుకోదగ్గ పనులు చేపట్టిన దాఖలాలు లేవు. నివేదికలు పంపామని, ప్రభుత్వం నుంచి అనుమతులు లభించాల్సి ఉందని ఎమ్మెల్యే సోమిరెడ్డి తన పర్యటన సందర్భంగా చెప్పుకొస్తున్నారు.

రైతులకు ఏటా రూ.20 వేలు ఇస్తాం



చంద్రబాబు సారథ్యంలో టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి వస్తే రైతుల సంక్షేమానికి పెద్ద పీట వేస్తాం. రైతు భరోసా కింద కేంద్రం ఇచ్చే డబ్బులు కాకుండా రూ.20 వేలు పెట్టుబడి సాయం అందిస్తాం. తీర ప్రాంతంలోని మత్స్యకారులకు వేట విరామ భృతి కింద ఏడాదికి రూ.20 వంతున ఇస్తాం. ఎంత మంది పిల్లలు చదువుకుంటుంటే అంత మందికి తల్లికి వందనం కింద రూ.15 వేలు చొప్పున ఇస్తాం. ఏడాదికి మూడు గ్యాస్ సిలిండర్లు ఫ్రీగా అందిస్తాం.

– సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి

సర్వేపల్లిలో జరిగిన ఎన్నికల ప్రచారంలో..

సోమిరెడ్డి ఇచ్చిన ప్రధాన హామీలు ఇవే..

→ మనుబోలు మండల ప్రచారంలో డేగపూడి–బండేపల్లి కాలువ నిర్మాణం పూర్తి చేస్తామన్నారు. గత ప్రభుత్వం ప్రధానమైన కాలువను విస్మరించిందని, తాను ఎమ్మెల్యే అయిన వెంటనే కాలువ పనులను ప్రారంభిస్తామని నమ్మబలికారు.

→ వెంకటాచలం మండలం తిరుమలమ్మపాళెం గ్రామానికి వెళ్లే మార్గంలో కండలేరు క్రీక్(ఉప్పుకాలువ)పై బ్రిడ్జి నిర్మాణం చేపడుతామని హామీ ఇచ్చారు.

→ పొదలకూరు మండల పర్యటనలో సోమశిల దక్షిణ కాలువ అసంపూర్తిగా ఉందని అటవీశాఖ నుంచి అనుమతులు తీసుకొచ్చి కాలువ నిర్మాణం పూర్తి చేయిస్తానన్నారు. ఫలితంగా అమ్మవారిపాళెం, ప్రభగిరిపట్నం తదితర గ్రామాలకు సాగునీటి సౌకర్యం కలుగుతుందని పేర్కొన్నారు.

→ మండలానికి సంబంధించి పొదలకూరుకు సమీపంలో సోమిరెడ్డి మంత్రిగా ఉన్న సమయంలో నిర్మించి అర్ధాంతరంగా నిలిచిపోయిన వాటర్‌గ్రిడ్ పనులను తిరిగి చేపట్టి పల్లెపల్లెకు తాగునీటిని అందజేస్తానని వెల్లడించారు. అప్పట్లోనే ఈ వాటర్ గ్రిడ్‌కు రూ.4 కోట్లు మంజూరైనట్లు తెలిపారు.

→ ఇవికాకుండా ఆయా గ్రామాల్లో నెలకొన్న సమస్యలకు సంబంధించి ఎన్నికల ప్రచారంలో పలు హామీలు గుప్పించారు.

ప్రశాంతమ్మా.. పట్టించుకోవమ్మా..

కోవూరు ఎమ్మెల్యేగా గెలుపొందిన వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి వందరోజుల పాలనలో సమస్యల పరిష్కారం అటుంచి, సొంత పార్టీ నేతల్లోనే వర్గపోరుకు కారణమవుతోంది. ఎన్నికల వేళ అనేక హామీలు గుప్పించిన ప్రశాంతమ్మ, అధికారంలోకి వచ్చిన తరువాత ఇతర పార్టీ నేతలను ఆమె వైపు తిప్పుకునేందుకే అధిక ప్రాధాన్యం ఇస్తున్నారు. దీంతో సొంత పార్టీ నేతలు అసహనం వ్యక్తం చేస్తున్నారు.

- స్థానిక సమస్యలను గాలికొదిలేసిన కోవూరు ఎమ్మెల్యే
- సొంత పార్టీలోనే ఆమెపై అసహనం
- పార్టీలో చేరికలపైనే అధిక దృష్టి


ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి

బుచ్చిరెడ్డిపాళెం రూరల్: వంద రోజుల కూటమి ప్రభుత్వంలో నియోజకవర్గంలో అనేక సమస్యలు తిష్ట వేసి ఉన్నాయి. వీటి పరిష్కారంపై దృష్టి సారించాల్సిన ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి, ఇతర పార్టీ నేతలను ఆకర్షించేందుకు ఎక్కువ ప్రాధాన్యం ఇస్తున్నారని తెలుగు తమ్ముళ్లే వాపోతున్నారు. దీనివల్ల నియోజకవర్గ టీడీపీలో రెండు గ్రూపుల మధ్య దూరం పెరిగింది. మొదటి నుంచి టీడీపీని అంటిపెట్టుకుని ఉన్న మాజీ ఎమ్మెల్యే పోలంరెడ్డి శ్రీనివాసులురెడ్డి తన కుమారుడు దినేష్‌రెడ్డికి టికెట్ ఇస్తారని ఆశించినా చివరి నిముషంలో ప్రశాంతిరెడ్డి కోవూరు టికెట్ దక్కించుకున్నారు. ఎన్నికలు పూర్తయ్యాయి. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టింది. అయినప్పటికీ కోవూరు టీడీపీలో రెండు గ్రూపుల మధ్య ప్రచ్ఛన్న యుద్ధం కొనసాగుతూనే ఉంది. ప్రశాంతిరెడ్డి ఎమ్మెల్యేగా గెలిచిన తర్వాత దినేష్‌రెడ్డి ఇప్పటివరకు ఒక్క అధికారిక కార్యక్రమంలో కూడా పాల్గొనలేదు. ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి అసలు దినేష్‌రెడ్డినే పక్కన పెట్టిందని, చోటామోటా నాయకులైన తమను పట్టించుకోకపోడంలో ఆశ్చర్యం ఏముంటుందని టీడీపీ నాయకులు, కార్యకర్తలు అంటున్నారు. ఎన్నికల సమయంలో మొదటినుంచి టీడీపీలో ఉన్నవారికి ఎలాంటి అన్యాయం చేసేదిలేదని, వారికి సముచిత స్థానం ఉంటుందని ప్రశాంతిరెడ్డి నమ్మబలికారు. ప్రస్తుతం పరిస్థితి దీనికి భిన్నంగా ఉంది. వైఎస్సార్ సీపీ నాయకులను పార్టీలో చేర్చుకోవడమే లక్ష్యంగా మంతనాలు సాగిస్తూ ముందుకు సాగుతున్నారు. ముఖ్యంగా బుచ్చిరెడ్డిపాళెం నగర పంచాయతీలో చైర్‌పర్సన్ మోర్ల సుప్రజతో సహా మరి కొంతమంది వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్లు నాలుగు రోజుల క్రితం నెల్లూరులోని ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డిని ఆమె నివాసంలో కలిశారు. ఎన్నికల సమయంలో తనను బెదిరించి పార్టీలో చేర్చుకునేందుకు ప్రశాంతిరెడ్డి ప్రయత్నించారని, అప్పట్లో కోవూరు మాజీ ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి చొరవతో బయటపడ్డానని ఆమె వివరించారు. ప్రస్తుతం ఏం జరిగిందే ఏమో తెలీదు, తాజాగా చైర్‌పర్సన్‌తో సహా పలువురు కౌన్సిలర్లు ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డిని కలవడం రాజకీయంగా ఆసక్తి రేపుతోంది. ప్రశాంతిరెడ్డి బుచ్చిరెడ్డిపాళెం నగర పంచాయతీ చైర్‌పర్సన్, కౌన్సిలర్లను టీడీపీలో చేర్చుకోవడమే లక్ష్యంగా పెట్టుకున్నారని టీడీపీ నాయకులే బహిరంగంగా వ్యాఖ్యానిస్తున్నారు.

తీవ్ర అసంతృప్తిలో టీడీపీ నాయకులు

నియోజకవర్గంలో అనేక సమస్యలతో ప్రజలు ఇబ్బంది పడుతుంటే ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి ఇవేవీ పట్టనట్లు వ్యవహరిస్తుండటంతో టీడీపీ నాయకులు ఇబ్బందులకు గురవుతున్నారు. ఆయా గ్రామాల్లో టీడీపీలో కొనసాగుతున్న వారిని స్థానిక ప్రజలు సమస్యలు పరిష్కరించాలని కోరుతున్నారు. వారికి ఏం సమాధానం చెప్పాలో సదరు నాయకులకు అర్థం కావడం లేదు. ఎమ్మెల్యే తమను పట్టించుకోవడం లేదని చెప్పలేక, ఇటు సమస్యలు పరిష్కరించలేక లోలోన మదనపడుతున్నారు.

సమస్యల పరిష్కారంలో విఫలం

అధికారంలోకి వచ్చాక ఎలాంటి అవినీతికి తావులేకుండా పాలన అందిస్తామని చెప్పిన ప్రశాంతిరెడ్డి అవేవీ పట్టించుకోవడంలేదు. ఎలాంటి అనుమతులు లేకున్నా కోవూరు, విడవలూరు, కొడవలూరు, ఇందుకూరుపేట, బుచ్చిరెడ్డిపాళెం మండలాల్లో టీడీపీ నేతలే మట్టితోలకాలను దగ్గరుండి ప్రోత్సహిస్తున్నారు.

- కోవూరు : ఎన్నికల ప్రచార సమయంలో వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి కోవూరు షుగర్ ఫ్యాక్టరీని ప్రారంభం చేస్తామని, అలాగే కార్మికుల బకాయిలు విడుదల చేసి వారికి న్యాయం చేస్తామని చెప్పారు. అంతేకాకుండా ఇందుకూరుపేట మండలంలోని ముదివర్తి– ముదివర్తిపాళెం కాజ్‌వే నిర్మాణం చేపడుతామన్నారు. అధికారంలోకి వచ్చిన తరువాత వాటి గురించి పట్టించుకోకుండా వదిలేశారు.

మహిళలందరికీ ఉచితంగా బస్సు ప్రయాణం

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే ప్రతి మహిళకు ఉచితంగా బస్సు ప్రయాణాన్ని కల్పిస్తుంది. ఎంత మంది బిడ్డలు చదువుకుంటుంటే.. అందరికీ రూ.15 వేలు చొప్పున తల్లికి వందనం కింద ఇస్తాం. మత్స్యకారులకు అండగా ఉంటాం. సూపర్ సిక్స్ పథకాల కింద మూడు గ్యాస్ సిలిండర్లు ఉచితంగా అందిస్తాం. 19 ఏళ్లు నిండిన ప్రతి మహిళకు నెలకు రూ.1,500 ఆర్థిక సాయం అందిస్తాం. నిరుద్యోగులకు ఉద్యోగాలు కల్పించేందుకు పరిశ్రమలను ఏర్పాటు చేస్తాం.

– వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి

కోవూరులో జరిగిన ఎన్నికల ప్రచారంలో..

సూరాయపాళెం ఇసుక యార్డ్ పరిశీలన


రికార్డులను పరిశీలిస్తున్న తహసీల్దార్ సారంగపాణి

పొదలకూరు : మండలంలోని సూరాయపాళెం ఇసుక డంపింగ్ యార్డును తహసీల్దార్ ఎం.సారంగపాణి శుక్రవారం పరిశీలించారు. డ్రెడ్జింగ్ పద్ధతిలో ఇక్కడి యార్డుకు ఇసుకను తోలుతున్నారు. రీచ్ నుంచి యార్డుకు 78 మీటర్ల దూరం ఉండడంతో ట్రాక్టర్ల ద్వారా ఇసుకను తోలుతున్నారు. కాగా ఈ యార్డును తహసీల్దార్ పరిశీలించి అక్కడి ఉద్యోగుల ద్వారా వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రస్తుతం యార్డులో 10,528.5 మెట్రిక్ టన్నుల ఇసుక నిల్వ ఉందన్నారు. అయితే ఇసుక ధరలు తదితర వివరాలు ఇంకా తమకు ఉత్తర్వుల రూపంలో అందలేదని, ఒకటి, రెండురోజుల్లో ఇసుకను అందజేస్తామన్నారు. తహసీల్దార్ వెంట వీఆర్వో శ్రీహరి ఉన్నారు.

క్రీడలతో మానసికోల్లాసం


ఇందుకూరుపేట : పోటీలో తలపడుతున్న విద్యార్థినులు


ఇందుకూరుపేట : క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న ఎంఈఓ


మనుబోలు : కబడ్డీలో పోటీ పడుతున్న బాలికలు

ఇందుకూరుపేట : క్రీడలతో శారీరక దృఢత్వంతో పాటు మానసికోల్లాసం కలుగుతుందని మండల విద్యాశాఖాధికారి–2 సునీల్ అన్నారు. మండలంలోని కొత్తూరు జెడ్పీ ఉన్నత పాఠశాల మైదానంలో అండర్– 14, అండర్– 17 విభాగాల్లో బాల బాలికలకు వేర్వేరుగా శుక్రవారం మండల స్థాయి పోటీలు నిర్వహించి క్రీడాకారులను ఎంపిక చేశారు. వీరు త్వరలో జరిగే నియోజకవర్గ స్థాయి పోటీల్లో పాల్గొననున్నారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు క్రీడలకు తగిన ప్రాధాన్యం ఇవ్వాలని కోరారు. క్రీడాకారులకు సమాజంలో ఉన్నత స్థానం, మంచి భవిష్యత్తు ఉంటుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో మండల స్థాయి కో–ఆర్డినేటర్ కె.అరోరా, పీడీలు ముజీర్, ప్రసాద్, లక్ష్మయ్య, వెంకట కృష్ణ, సుందరబాబు, పల్లవి, రేణుక, జ్యోతి పాల్గొన్నారు.

- మనుబోలు : స్థానిక బాలికల జెడ్పీ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో రెండు రోజులుగా జరుగుతున్న మండల స్థాయి ఆటల పోటీలు శుక్రవారం ముగిశాయి. అండర్–17 బాలికల వాలీబాల్ విభాగంలో జెడ్పీ బాలికల పాఠశాల విద్యార్థులు విజేతలుగా, జెడ్పీ హైస్కూల్ రన్నర్‌గా నిలిచింది. బాలుర వాలీబాల్ విభాగంలో శుశృత స్కూల్ విజేతగా, వీరంపల్లి జెడ్పీ హైస్కూల్ రన్నర్‌గా నిలిచింది. కబడ్డీ బాలుర విభాగంలో మనుబోలు హైస్కూల్ విన్నర్‌గా, మడమనూరు రన్నర్‌గా నిలిచాయి. అలాగే కబడ్డీ అండర్–14 విభాగంలో మనుబోలు హైస్కూల్ విన్నర్‌గా, బద్దెవోలు రన్నర్‌గా నిలిచాయి. వీరందరినీ నియోజకవర్గ స్థాయి పోటీలకు ఎంపిక చేసినట్లు పీడీ ప్రమీలారాణి తెలిపారు.
- బుచ్చిరెడ్డిపాళెం రూరల్: మానసిక ఆరోగ్యానికి క్రీడలు అవసరమని బుచ్చిరెడ్డిపాళెం సీఐ శ్రీనివాసులురెడ్డి అన్నారు. మండలంలోని దామరమడుగు జెడ్పీ ఉన్నత పాఠశాలలో శుక్రవారం జరిగిన స్కూల్ గేమ్స్ ఎంపికల కార్యక్రమంలో సీఐ పాల్గొని, మాట్లాడారు. విద్యార్థులు ప్రతిరోజు ఆటలు ఆడాలని సూచించారు. కార్యక్రమంలో ఎంఈఓ రత్నం, హెచ్‌ఎం సర్దార్, ఉపసర్పంచ్ శ్రీనివాసులు, వ్యాయామ ఉపాధ్యాయుడు నరసయ్య పాల్గొన్నారు.
- ముత్తుకూరు : మండల స్థాయిలో హైస్కూల్ విద్యార్థులకు రెండు రోజుల పాటు జరిగే క్రీడా పోటీలు శుక్రవారం ఈదూరు ఈశ్వరమ్మ జెడ్పీ హైస్కూల్‌లో ప్రారంభమయ్యాయి. ఈ పోటీలను పేరెంట్స్ కమిటీ చైర్‌పర్సన్ ధరణిజ ప్రారంభించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం శ్రీనివాసరావు మాట్లాడుతూ, మండలంలోని ప్రభుత్వ, ప్రైవేటు హైస్కూళ్లకు సంబంధించి 150 మంది విద్యార్థులు పోటీల్లో పాల్గొంటున్నారని తెలిపారు.
- కొడవలూరు : మండలంలోని యల్లాయపాళెం జెడ్పీ హైస్కూల్ ప్రాంగణంలో ఎస్జీఎఫ్ మండల స్థాయి క్రీడా జట్లను శుక్రవారం ఎంపిక చేశారు. కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, షటిల్ బ్యాడ్మింటన్, యోగా, చెస్, అథ్లెటిక్స్‌లలో పోటీలు నిర్వహించి అండర్–14, 17 విభాగాల్లో జట్లను ఎంపిక చేశారు. ఈ పోటీలను ఎంఈఓలు జి.వసంతకుమారి, ఎస్.అంకయ్య ప్రారంభించారు. ఉన్నత పాఠశాలల ఫిజికల్ డైరెక్టర్లు ఐ.శ్రీధర్‌రెడ్డి, వెంకటేశ్వర్లు, కె.సుబ్బారావు, బి.శ్రీవిద్య, చెన్నారావు ప్రతిభ ఆధారంగా జట్లకు క్రీడాకారులను ఎంపిక చేశారు. హెచ్‌ఎం ఎ.మోహనరామలింగయ్య పాల్గొన్నారు.


బుచ్చిరెడ్డిపాళెం రూరల్: క్రీడాకారులతో సీఐ శ్రీనివాసులురెడ్డి


ముత్తుకూరు జెడ్పీ హైస్కూల్‌లో..


కొడవలూరు : వాలీబాల్ పోటీలను ప్రారంభిస్తున్న ఎంఈఓ వసంతకుమారి

హెల్మెట్ ధరించి ప్రాణాలను కాపాడుకోండి


స్థానికులకు అవగాహన కల్పిస్తున్న సీఐ రాంబాబు

మనుబోలు : ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరిస్తే ప్రమాదాలు జరిగినప్పుడు ప్రాణాలు కాపాడుకోవచ్చని సీఐ రాంబాబు అన్నారు. ఎస్పీ కృష్ణకాంత్ ఆదేశాలతో మనుబోలు మండల కేంద్రంలో శుక్రవారం ఆయన ఆటోవాలాలు, ద్విచక్ర వాహనదారులకు రోడ్డు ప్రమాదాల నివారణపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆటో డ్రైవర్లు తప్పనిసరిగా లైసెన్స్ కలిగి ఉండాలన్నారు. నిబంధనలు పాటిస్తూ వాహనాలు నడపాలన్నారు. పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకోవద్దని సూచించారు. అతివేగం, రాంగ్ రూట్‌లో వెళ్లడం లాంటివి ప్రమాదాలకు కారణమవుతాయని తెలిపారు. రోడ్ సేఫ్టీ నిబంధనలను పాటిస్తే ప్రమాదాలను నివారించవచ్చని తెలియజేశారు. నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

పౌష్టికాహారంతోనే ఆరోగ్యం



మనుబోలులో విద్యార్థుల మానవహారం

మనుబోలు : మంచి పోషక విలువలున్న ఆహారం తీసుకోవడం వల్ల రక్తహీనతను అధిగమించి ఆరోగ్యంగా ఉండొచ్చని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రమణమ్మ అన్నారు. పౌష్టికాహార మాసోత్సవాల్లో భాగంగా మనుబోలు జెడ్పీ బాలికల ఉన్నత పాఠశాల ఆవరణలో శుక్రవారం విద్యార్థులతో మానవహారం ఏర్పాటు చేసి పౌష్టికాహార ఆవశ్యకత, పరిసరాల పరిశుభ్రతపై కిశోర బాలికలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గుడ్లు, పాలు, ఆకుకూరలు, తాజా కూరగాయలు, పండ్లు రోజువారీ ఆహారంలో ఉండేలా చూసుకోవాలన్నారు. ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడంతో పాటు వ్యక్తిగత పరిశుభ్రతను పాటించాలని సూచించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం వసంతకుమారి, అంగన్‌వాడీలు సుగుణమ్మ, విజయమ్మ, సుజన, నిర్మల, మహిళా పోలీసులు శ్రావ్య, నబియా తదితరులు పాల్గొన్నారు.

- కొడవలూరు : పోషక విలువలున్న ఆహారం తీసుకోవడం ద్వారా రక్తహీనతను దూరం చేసుకోవాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ వి.పద్మావతి సూచించారు. మండలంలోని చింతచెలికలో పోషక విలువలపై గర్భిణులు, బాలింతలకు శుక్రవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతిరోజూ ఆకుకూరలు, చిరుధాన్యాలు తీసుకోవడం ద్వారా పోషక విలువలు పెంచుకోవచ్చన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయుడు పి.శ్రీధర్, అంగన్‌వాడీ కార్యకర్తలు ఇ.ప్రసూన, జి.అరుణ, పి.అమరావతి పాల్గొన్నారు.


అవగాహన కల్పిస్తున్న సూపర్‌వైజర్ పద్మావతి

వైభవంగా గ్రామోత్సవం


నిమజ్జనానికి తరలి వెళ్తున్న గణపయ్య

మనుబోలు : మండల కేంద్రమైన మనుబోలులో వినాయక చవితి సందర్భంగా స్థానిక వినాయక మండపం వద్ద ఏర్పాటు చేసిన గణనాథునికి శుక్రవారం రాత్రి వైభవంగా గ్రామోత్సవం నిర్వహించి నిమజ్జనం చేశారు. అర్చకుడు సాయికుమార్ శర్మ ప్రత్యేక పూజల అనంతరం గణేశ్ లడ్డూకు వేలం నిర్వహించగా సాలాపక్షి వెంకటేశ్వర్లు రూ.43 వేలకు దక్కించుకున్నారు. అలాగే వినాయకుని మెడలో వేసిన నగదు మాలను వేలం వేయగా ఉత్సవ కమిటీ వారు రూ.21 వేలకు దక్కించుకున్నారు. డీజే, మంగళ వాయిద్యాల నడుమ యువకులు ఉత్సాహంగా గ్రామోత్సవం వెంట కేరింతలు కొట్టారు. అనంతరం గణనాథుని గ్రామ సమీపంలోని కమాల్ వంతెన వద్ద కండలేరులో నిమజ్జనం చేశారు. కార్యక్రమాలకు ఉభయకర్తలుగా గూడూరు పెంచలయ్య, జ్యోతి దంపతులు వ్యవహరించారు.

క్లుప్తంగా

వివిధ కోర్సుల్లో ఉచిత శిక్షణ

విడవలూరు : స్థానిక పీఆర్‌ఆర్–వీఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో స్వర్ణభారత్ సోమా టెక్నికల్ ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూట్ వారు శుక్రవారం శిక్షణా సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ బి.సుజాత మాట్లాడుతూ ఎలక్ట్రీషియన్, కారు డ్రైవింగ్, ప్లంబింగ్, ఏసీ మెకానిక్ వంటి కోర్సుల్లో ఉచిత శిక్షణ ఇస్తున్నారని, శిక్షణా కాలంలో భోజన వసతి ఉంటుందని తెలియజేశారు. ఈ అవకాశాన్ని కళాశాల విద్యార్థులతో పాటు గ్రామంలోని నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఇతర వివరాలకు 93985 35137, 98662 54740 నంబర్లను సంప్రదించాలని కోరారు.

కోస్టల్ క్లీనప్ డే నేడు

ముత్తుకూరు : ఇంటర్నేషనల్ కోస్టల్ క్లీనప్ డే శనివారం ఉదయం జరుగుతుందని కృష్ణపట్నం ఇండియన్ కోస్టుగార్డు అధికారులు శుక్రవారం ఒక ప్రకటనలో వెల్లడించారు. మండలంలోని కృష్ణపట్నం గ్రామ సముద్ర తీరంలో ఉదయం చెత్త, వ్యర్థాలు తొలగించే కార్యక్రమం జరుగుతుందని పేర్కొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు మనుబోలు విద్యార్థులు


విద్యార్థినులను అభినందిస్తున్న పీడీ వేణుగోపాల్‌రెడ్డి

మనుబోలు : మనుబోలు మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలకు చెందిన తొమ్మిది మంది విద్యార్థులు రాష్ట్రస్థాయి క్రీడలకు ఎంపికైనట్లు కళాశాల పీడీ వేణుగోపాల్ తెలిపారు. నెల్లూరులోని ఏసీ సుబ్బారెడ్డి స్టేడియంలో స్కూల్ గేమ్స్ ఆఫ్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో అండర్–19 విభాగంలో శుక్రవారం జరిగిన త్రోబాల్ పోటీల్లో సీనియర్ ఇంటర్ విద్యార్థులు సుమంత్, చరణ్‌లు రాష్ట్రస్థాయికి ఎంపికైనట్లు వివరించారు. అలాగే కత్తి యుద్ధం (ఫెన్సింగ్)లో మండలంలోని వీరంపల్లి గ్రామానికి చెందిన విద్యార్థులు ఎస్కే హబీబా, ఎస్కే జరీనా, రోషిణి, తస్లీమా, నాగరాజు, పూజిత్‌లు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు తెలియజేశారు. ఈ మేరకు ఫెన్సింగ్‌లో సత్తాచాటిన విద్యార్థినులను అభినందించారు.

ముత్తుకూరులో డీఎల్‌పీఓ విచారణ


విచారణ చేస్తున్న డీఎల్‌పీఓ శ్రీనివాసరావు

ముత్తుకూరు : ముత్తుకూరు సర్పంచ్ బూదూరు లక్ష్మి ఇటీవల చేసిన ఆరోపణలపై విచారణ జరిపించాలని ఉపసర్పంచ్ కె.అనితారెడ్డి డీపీఓ సుస్మితారెడ్డికి చేసిన విజ్ఞప్తి మేరకు డీఎల్‌పీఓ శ్రీనివాసరావు శుక్రవారం విచారణ చేపట్టారు. స్థానిక సచివాలయంలో జరిగిన విచారణకు సర్పంచ్ లక్ష్మి, ఉపసర్పంచ్ అనితారెడ్డి, ఆమె భర్త కె.లక్ష్మణరెడ్డి, వార్డు సభ్యుడు షఫీఉల్లా తదితరులు హాజరయ్యారు. సంతకాలు, వేలిముద్రలు ఫోర్జరీ చేశారంటూ సర్పంచ్ చేసిన ఫిర్యాదుపై విచారణ జరపాలని, ఫోరెన్సిక్ పరీక్షలు జరపాలని ఉపసర్పంచ్ డిమాండ్ చేశారు. అవినీతిని గుట్టురట్టు చేయాలని డీఎల్‌పీఓను కోరారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ, డీపీఓ ఆదేశాల మేరకు విచారణ చేపట్టామని, నివేదికను అందజేస్తామన్నారు.

మార్కెట్లోకి టాటా కర్వ్ కారు విడుదల

వెంకటాచలం : మండలంలోని చెముడుగుంట వద్దనున్న వరలక్ష్మి ఆటో మొబైల్స్ ప్రైవేట్ లిమిటెడ్ టాటా షోరూమ్‌లో టాటా కర్వ్ కారు కొత్త మోడల్‌ను శుక్రవారం విడుదల చేశారు. కార్యక్రమంలో కేఎస్‌ఎన్ గ్రూప్ అధినేత సత్యనారాయణ, డిప్యూటీ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ బి.చందర్, రోడ్ ట్రాన్స్‌పోర్ట్ అధికారిణి శ్రీచందన, అపోలో హాస్పిటల్ వైద్యులు డాక్టర్ కె.రాజశేఖర్, వరలక్ష్మి టాటా మోటార్స్ సీనియర్ సేల్స్ మేనేజర్ శ్రీకాంత్, అసిస్టెంట్ సేల్స్ మేనేజర్ గోపి, మహేష్, ఫైనాన్స్ ఇన్‌చార్జి అక్షిత్ పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతే లక్ష్యం


పిచ్చి మొక్కలను తొలగిస్తున్న గ్రామస్తులు

విడవలూరు : పరిసరాల పరిశుభ్రతే ప్రధాన లక్ష్యంగా స్వచ్ఛత హీ సేవా కార్యక్రమం చేపడుతున్నట్లు ఈఓపీఆర్డీ ఉదయ్ అన్నారు. స్థానిక ప్రభుత్వ ఆస్పత్రి ప్రాంగణంలో పిచ్చి మొక్కలు, గడ్డిని శుక్రవారం తొలగించి శుభ్రం చేశారు. ఈ సందర్భంగా పరిసరాల పరిశుభ్రతతో పాటు వ్యక్తిగత పరిశుభ్రత ముఖ్యమని తెలిపారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి హరిప్రసాద్, టీడీపీ నేత సత్యవోలు సత్యంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.